# 'మల్లన్న' ఆలయంలో భక్తుల సందడి




గోపురం వద్ద భక్తులు, ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

చేర్యాల, డిసెంబర్ 8 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ప్రతి ఆదివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొమురవెల్లి క్షేత్రానికి 10 వేల మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ఈవో అలూరి బాలాజీశర్మ తెలిపారు. అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశ ఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు భక్తులు నిర్వహించారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతిగీరలు వద్ద ప్రదక్షణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు నిర్వహించారు. ఆలయ ఏఈవో బుద్ది శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుడి మల్లికార్జున్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు భక్తులకు సేవలందించారు.

# నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు



నార్కోటిక్ డాగ్‌తో చేర్యాల తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై నిరేశ్

చేర్యాల, డిసెంబర్ 8 : గంజాయి ఇతర మత్తు పదార్థాలు, డ్రగ్స్ నివారణకు ఆదివారం ఎస్సై నిరేశ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. పట్టణంతో పాటు మండలంలోని చుంచనకోటలో కిరాణ షాపులు, పాన్ డబ్బాలు తదితర అనుమానిత ప్రదేశాల్లో డాగ్ స్క్వా డ్‌తో పాటు పీసీలు అకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, రవాణ చేసినా వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# రాజ్యాధికారం కోసం ముందుకు సాగాలి



నినాదాలు చేస్తున్న బీసీ నేతలు

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 8 : బీసీలు రాజ్యాధికారమే పరమావధిగా ముందుకు సాగాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ పిలుపునిచ్చారు. బీసీ రాజ్యాధికార ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ ముదిగొండ శ్రీనివాస్ నేతృత్వంలో ఆదివారం సిద్దిపేట మార్కండేయ దేవాలయ పద్మశాలీ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడారు. నేతలు కృష్ణదయాసాగర్,నాగేశ్వరరావు, రాములు, శ్రీనివాస్, ముదిగొండ శ్రీనివాస్, శంకర్, ప్రశాంత్, శ్రీశైలం, హైమవతి, కిశోర్, లక్ష్మి, స్వరూప, కొమురయ్య, రమేశ్, కుమార్‌గౌడ్, సంతోశ్ పాల్గొన్నారు.


# అధికారులు వెంటనే తనిఖీ చేయాలి

సిద్దిపేట,డిసెంబర్ 8: సిద్దిపేట పట్టణంలో అనేక కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఎలాంటి పర్మిషన్లు లేకుండా అక్రమంగా నడుస్తున్నాయని,వాటిని వెంటనే తనిఖీలు చేయాలని, ఎస్‌ఎఫ్‌ఐ సిద్దిపేట పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్ భాను డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌ఎఫ్‌ఐ సిద్దిపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వెంటనే విద్యాశాఖ ఆధికారులు తనిఖీలు చేసి పర్మిషన్ లేకుండా నడుస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్ని సీజ్ చేయాలన్నారు.



సిద్దిపేట మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న మహిళా రైతు

# ధాన్యం ముద్దయ్యింది..



తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

సిద్దిపేట జిల్లాలో శనివారం అర్ధరాత్రి పలుచోట్ల వర్షం కురిసింది. దీంతో సిద్దిపేట మార్కెట్‌యార్డులో ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఆరుకాలం కష్టపడి పంట పండించి ధాన్యాన్ని మార్కెట్లో తీసుకొచ్చాక.. ప్రభుత్వం కొనడంలో ఆలస్యమవుతున్నదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం త్వరగా ధాన్యాన్ని కొని రైతన్నలను ఆదుకోవాలని కోరుతున్నారు. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట జిల్లా (డిసెంబర్,8)



సిద్దిపేట మార్కెట్ యార్డు లో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

# గురుకులాల్లో సమస్యల తిష్ట

- పూర్తి నివేదికను రాష్ట్ర కమిటీకి అందజేస్తాం
- సమావేశంలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురామ్



సమావేశంలో మాట్లాడుతున్న పరశురామ్

హుస్నాబాద్, డిసెంబర్ 8 : ప్రభుత్వ సంక్షేమ గురుకులాల్లో ఎన్నో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని, వీటిని పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గురుకుల సందర్శన సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి సూరంపల్లి పరశురామ్ అన్నారు. బీఆర్‌ఎస్ గురుకుల సందర్శన కార్యక్రమం ముగింపు సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు జంగిడి కమలాకర్, రెడ్డి యాదగిరిలతో కలిసి గురుకుల బాట కార్యక్రమం నవంబర్ 30 నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు నిర్వహించామన్నారు. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, ఎస్సీ ఎస్టీ బీసీ వసతీ గృహాలను సందర్శించినట్లు చెప్పారు. గురుకులాలు, హాస్టళ్లలోని విద్యార్థులకు బెడ్ షీట్స్, యూనిఫామ్స్, స్పోర్ట్స్ దుస్తులు, షూస్, దుప్పట్లు ఇప్పటికీ అందలేదన్నారు. కాస్మోటిక్ చార్జీలు, పౌష్టికాహారం ఇవ్వడం లేదన్నారు. నాణ్యమైన భోజనం లేక, దోమలు అధికమై చాలా మంది విద్యార్థులు వ్యాధుల బారిన పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. వంట గదులు, వాటర్ హీటర్లు లేవన్నారు. గురుకులాలు, హాస్టళ్లలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే విద్యార్థులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. హాస్టల్ విద్యార్థులకు ఏ సమస్య ఉన్నా హెల్ప్ లైన్ నంబర్ 8522044336కు చెప్పాలని సూచించారు. సమావేశంలో బొజ్జ హరీశ్, సతీశ్, సంపత్, నవీన్ కుమార్, మంకాల రమేశ్, సుమన్ నాయక్, బైరి రవి పాల్గొన్నారు.

# ప్రమాదబీమా చెక్కు అందజేత



ప్రమాదబీమా చెక్కును అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, డిసెంబర్ 8: బీఆర్‌ఎస్ శ్రేణులకు పార్టీ అండగా ఉంటుందని, రాబోయే రోజుల్లో భవిష్యత్ మనదేనని గజ్వేల్ బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన పార్టీ కార్యకర్త చిక్కుడు కిరణ్ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు ప్రమాదబీమా చెక్కును అందజేశారు. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు విరాసత్ అలీ, కృష్ణారెడ్డి, ఆకుల దేవేందర్, గుంటుక రాజు, రమేశ్‌గౌడ్, బాబా షేర్ అలీ, ఉమర్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం పట్టివేత



వర్ధరాజ్‌పల్లిలో రేషన్ బియ్యం పట్టుకున్న టాస్క్‌ఫోర్స్, పోలీసులు

తొగుట,డిసెంబర్ 8 : అక్రమంగా నిల్వచేసిన పీడీఎఫ్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసిన సంఘటన తొగుట మండలంలోని, మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వర్ధరాజ్‌పల్లిలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. సిద్దిపేట టాస్క్ ఫోర్స్ ఆర్‌ఎస్‌ఐ సాయి చరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. తొగుట మండలం మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వర్ధరాజ్‌పల్లి గ్రామ శివారులో పిల్లిగుట్ట సమీపంలో అక్రమంగా పీడీఎఫ్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు మిరుదొడ్డి తొగుట పోలీసులు సంయుక్తంగా కలిసి దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వచేసిన 15 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకొని మిరుదొడ్డి సివిల్ సప్లై గోదామ్‌కు తరలించారు. అక్రమంగా పీడీఎఫ్ బియ్యాన్ని నిల్వచేసిన నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిరుదొడ్డి పోలీసులు తెలిపారు.

# జూడో పోటీలకు తెలంగాణ కోచ్‌గా భరత్



కోచ్ భరత్

సిద్దిపేట, డిసెంబర్ 8 : ఎస్‌జీఎఫ్ అండర్ 17 తెలంగాణ బాలికల టీమ్‌కోచ్‌గా సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన చామంతుల భరత్ నియమించినట్లు రాష్ట్ర ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రామ్ రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిపుర రాష్ట్రం డిసెంబర్ 12 నుంచి 15వ తేదీ వరకు జరిగే ఎస్‌జీఎఫ్ అండర్–17 బాలికల జాతీయస్థాయి జూడో పోటీలకు తెలంగాణ టీం కోచ్‌గా చామంతుల భరత్ వ్యవహరించనున్నట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షుడు నంట శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భరత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



ఐనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొమురవెల్లి, డిసెంబర్ 8 : కొమురవెల్లి మండలంలోని ఐనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996–97 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దాదాపు 27 ఏండ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా తాము పాఠశాలలో చదువుకున్నప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్రీరాములు, నర్సింహులు, జనార్దన్‌రెడ్డి, పూర్వవిద్యార్థులు వెంకట్‌రెడ్డి, జైన నరేశ్, నాగరాజు, మల్లికార్జున్, స్వామి, రాజయ్య, శ్రీనివాస్, రఘుపతి, సుధాకర్, నసియా, అసిన్, పుష్పలత, వాసవి, పద్మ, స్వరూప, శ్రీల, తదితరులు పాల్గొన్నారు.

# వధూవరులకు ఆశీర్వాదం..



చేర్యాలలో వివాహా వేడుకకు హాజరైన ఎస్సీఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు

చేర్యాల, డిసెంబర్ 8 : పట్టణంలోని శివ ప్రసన్న ఫంక్షన్ హాలులో సోమారపు స్వరూప భాగ్యలక్ష్మి –శ్రీనివాస్ దంపతులు కుమార్తె వాణీ సంపత్ కుమార్ పెండ్లి ఆదివారం జరిగింది. పెండ్లి వేడుకలకు ఎస్సీఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్, గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మదాసు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం మాజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్, బీఆర్‌ఎస్ యువజన చేర్యాల ఇన్‌చార్జి అంజయ్య, నాయకులు ఏర్పుల మహేశ్, తాండ్ర సాగర్, బొంగురపు జితేందర్‌రెడ్డి, రాళ్లబండి చందు, బంగారిగల్ల కిరణ్ కుమార్, లింగంపల్లి మహేశ్ ఉన్నారు.

# యాసంగి పనులు షురూ

- హుస్నాబాద్ డివిజన్‌లో దాదాపుగా పూర్తయిన వానకాలం పంట కోతలు
- యాసంగి సాగుకు నార్లు పోస్తున్న రైతన్నలు
- డివిజన్‌లో గతేడాది యాసంగిలో 70,392ఎకరాల్లో పంటల సాగు
- ఈ ఏడాది యాసంగిలో 65,692ఎకరాల్లో సాగు అంచనా, గతేడాదికంటే తక్కువ సాగయ్యే అవకాశం
- పంట పెట్టుబడి సాయం కోసం రైతన్నల ఎదురు చూపు



పొలంలో గొర్రు కొడుతున్న రైతు

హుస్నాబాద్, డిసెంబర్ 8 : వానకాల పంట కోతలు పూర్తయ్యాయి. ఇక యాసంగి సాగుకు రైతన్నలందరూ సన్నద్ధమవుతున్నారు. హుస్నాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల్లో యాసంగి వరి సాగుకు రైతులు నారు మడులు దున్ని నార్లు పోస్తున్నారు. కొందరు రైతుల నార్లు సైతం ఎదిగి నాటు వేసే దశకు చేరుకున్నాయి. మొక్కజొన్న, వేరుశనగ, పొద్దుతిరుగుడు పంటలు కూడా వేస్తున్నారు. వానకాలం పంట కోతలు పూర్తి కాగా, మార్కెట్‌కు తరలించిన రైతులు యాసంగి ఎవుసం పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఆగస్టు నెల చివరిలో సెప్టెంబర్ ప్రారంభంలో కురిసిన భారీ వర్షాలు యాసంగి పంటల సాగుకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఇప్పటికీ చెరువులు, కుంటల్లో నీళ్లున్నాయి. రైతులు పొలం దున్ని నాట్లు వేయడమే తరువాయి.. అయితే ప్రస్తుతం ఉన్న నీళ్లను చూసి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయడం సరికాదని, రానురాను భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉన్నందున రైతులు పంటలను ఆచితూచి వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

## గతేడాది యాసంగిలో 70,392ఎకరాల్లో పంట సాగు

గతేడాది 2023–24లో హుస్నాబాద్ డివిజన్‌లోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల్లో మొత్తం 70,392ఎకరాల్లో పంటల సాగు చేశారు. ఇందులో వరి పంట 55,423ఎకరాల్లో సాగు చేయగా మొక్కజొన్న 12,295ఎకరాలు, వేరుశనగ 353ఎకరాలు, పొద్దుతిరుగుడు పంట 1,719ఎకరాలు, ఇతర పంటలు 603ఎకరాల్లో సాగు చేశారు. గతేడాది డివిజన్‌లోని రైతులందరూ వరి పంట, మొక్కజొన్న పంటల సాగుకే ఎక్కువ మొగ్గు చూపారు. వాణిజ్య పంటలైన వేరుశనగ, పొద్దుతిరుగుడు పంటల సాగుకు విముఖత చూపడం విశేషం.

## ఈ ఏడాది సాగు అంచనా 65,692ఎకరాలు..

ఈ ఏడాది 2024–25లో హుస్నాబాద్ డివిజన్‌లో 65,692ఎకరాల్లో పంటల సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో వరి 49,050 ఎకరాల్లో సాగు కానుండగా మొక్కజొన్న 14,878ఎకరాలు, వేరుశనగ 237ఎకరాలు, పొద్దుతిరుగుడు 1,192 ఎకరాలు, ఇతర పంటలు 335ఎకరాల్లో సాగు కానున్నట్లు అధికారులు తెలిపారు. కాగా గతేడాదికంటే ఈ యాసంగి సీజన్‌లో 4,700 ఎకరాల్లో పంటల సాగు విస్తీర్ణం తగ్గనుండటం విశేషం. గతేడాది 55,423 ఎకరాల్లో వరిపంట, 12,295 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు కాగా ఈ ఏడాది వరి పంట 49,050 ఎకరాలు, మొక్కజొన్న పంట 14,878ఎకరాల్లో సాగు కానున్నది. ఈసారి మొక్కజొన్న సాగుపై రైతులు దృష్టిసారిస్తున్నట్లు సమాచారం.

## పెట్టుబడి సాయం (రైతు భరోసా) కోసం రైతన్నల ఎదురు చూపు


యాసంగి పంటలకు నీళ్లున్నా పంటల సాగుకు పెట్టుబడి డబ్బులు ఎలా అనే దానిపై రైతన్నలు ఆందోళనలో ఉన్నారు. గతేడాది వారకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి పంట సాగుకు ముందు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం ఎకరాకు రూ.5 వేలు ఇచ్చేది. కాంగ్రెస్ సర్కారు వచ్చినప్పటి నుంచి పెట్టుబడి సాయం అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వానకాలం పంట అమ్మితే వచ్చిన డబ్బులు అప్పులకే సరిపోగా, పంటపెట్టుబడి కోసం మళ్లీ అప్పు చేయాల్సి వస్తోందని పలువురు రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుబంధు ప్రభావం వల్ల కూడా పంటల సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. అయినా రైతులు మొక్కవోని ధైర్యంతో యాసంగి సాగుకు సిద్ధమవుతున్నారు.

### వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి



యాసంగి సీజన్‌లో పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. నారు మడులు దున్ని నుంచి నారు పోసి నాటు వేసే వరకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, ఆ తర్వాత రావాల్సిన ఎరువులు తదితర అంశాలపై ఎప్పటికప్పుడు రైతులు వ్యవసాయ అధికారులు సలహాలు సూచనలు తీసుకోవాలి. అప్పుడే పంట దిగుబడులు అధికంగా వస్తాయి. యాసంగిలో ఎక్కు వ చీడపీడలు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులను సంప్రదిస్తే తగిన ఎరువులను సూచిస్తారు. రైతు వేదికల్లో జరిగే అవగాహన సదస్సులకు హాజరై పంటసాగులో మెళకువలు నేర్చుకోవాలి. వానకాల పంట కోసిన అనంతరం వరికొయ్యలను తగులబెట్టకుండా పొలంలోనే దాన్ని మురగబెడితే భూమిలోని పోషకాలు వెళ్లకుండా ఉంటాయి.

-శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (హుస్నాబాద్)



హుస్నాబాద్ పట్టణ శివారులో నారు పోసుకున్న రైతు

# మద్దూరుకు 108 సేవలు

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 8 : మద్దూరు మండలానికి ప్రభుత్వం నూతనంగా 108 అంబులెన్స్ వాహనాన్ని కేటాయించింది. ఆదివారం అంబులెన్స్ మద్దూరు మండల కేంద్రానికి చేరుకున్నది. మారుమూల మండలమైన మద్దూరు మండలానికి అంబులెన్స్ సౌకర్యం లేక పోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మద్దూరుకు అంబులెన్స్‌ను కేటాయించాలని ప్రజలు పెద్ద ఎత్తున డిమాండ్ చేయడంతో ఎట్టకేలకు మద్దూరు మండలానికి అంబులెన్స్ కేటాయించింది. అంబులెన్స్ వాహనాన్ని కేటాయించడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# చుంచనకోటలో కుక్కల దాడి

చేర్యాల, డిసెంబర్ 8 : మండలంలోని చుంచనకోటలో ఆదివారం కుక్కల దాడిలో చిన్నారితో పాటు ముగ్గురు గాయపడ్డారు. గ్రామానికి చెందిన బాలుడు విఘ్నేష్‌చారి వీధిలో అడుకుంటున్న సమయంలో కుక్క ఒక్కసారిగా దాడి చేసి గాయపర్చింది. ఇదే ఘటనలో గ్రామానికి చెందిన లక్ష్మీనర్సయ్యతో పాటు మరో నలుగురు వ్యక్తులపై కుక్కలు దాడి చేసి గాయపర్చినట్లు గ్రామస్తులు తెలిపారు. దాడి ఘటనలో గాయపడిన వారిని చేర్యాల దవాఖానలో వైద్యులు ప్రాథమిక చికిత్సలు అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ఏరియా దవాఖానకు తరలించినట్లు తెలిపారు. గ్రామంలో మరికొందరిపై కుక్కలు దాడి చేయకముందే వాటి నియంత్రణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# దుద్దెడలో స్వాములకు ఘన స్వాగతం

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 8 : శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములకు ఆదివారం కొండపాక మండలంలోని దుద్దెడ అయ్యప్ప స్వాములు ఘనస్వాగతం పలికారు. సిద్దిపేట కోటి లింగాల సన్నిధానం నుంచి శబరిమలకు ఇరుముడితో బయలుదేరిన గురుస్వామి జాలిగామ ఉపేందర్‌రావు స్వామితో పాటు మిగతా అయ్యప్ప స్వాములకు స్వాగతం పలికారు. గురుస్వాములు చిలుముల వెంకటేశం, కనకరాజు, అయ్యప్ప స్వాములు బొజ్జ జగదీశ్వర్, పెద్దంకుల నాగరాజుగౌడ్, శీలం రాజు, గున్నాల నాగరాజ్‌గౌడ్, పెద్దంకుల నాగరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం



కాసులాబాద్‌లో మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

మిరుదొడ్డి, డిసెంబర్ 8 : మిరుదొడ్డి మండలంలోని కాసులాబాద్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో భూపతి మృతి చెందాడు. 1990–91వ బ్యాచ్ చెందిన భూపతి కుటుంబానికి ఆదివారం నాటి పూర్వ విద్యార్థులు రూ. 20 వేలు ఆర్థిక సాయం అందజేసి స్నేహహస్తం అందించారు. అదే గ్రామానికి అదే బ్యాచ్‌కి చెందిన పూర్వపు విద్యార్థి భూపాల్ తండ్రి ఇటీవల మృతి చెందగా, అతడికి రూ.2 వేలు అందజేశారు. మాజీ సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు, పూర్వపు విద్యార్థులు మల్లేశం, రాం దేవ్, చంద్రశేఖర్, అహ్మద్, ముత్యం, బాలరాజు ఉన్నారు.

## గజ్వేల్‌లో..

గజ్వేల్, డిసెంబర్ 8: మండల పరిధిలోని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన అనాథ యువతి ఆందోల్ అలేఖ్య వివాహానికి మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అమ్మాయి చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి చెందారు. నిరుపేద కుటుంబం కావడంతో వివాహ ఖర్చులకు సాయం అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, అహ్మద్, నిజామొద్దీన్, రామగౌడ్, బుచ్చిరెడ్డి, రాములు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

# విమర్శలు మానుకోవాలి

బెజ్జంకి, డిసెంబర్ 8: మండలంలో ఏర్పాటు చేసే ఇథనాల్ పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేస్తే కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ నాయకులపై విమర్శలు చేయడం తగదని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కనగండ్ల తిరుపతి కోరారు. ఇథనాల్ పరిశ్రమలకు అధికారులు అనుమతి ఇచ్చారే తప్పా.. నాయకులు కాదన్నారు. నిర్మల్ జిల్లాలో రద్దు చేసిన మాదిరిగనే బెజ్జంకి మండలంలోని ఇథనాల్ పరిశ్రమలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని బీఆర్‌ఎస్వీ మండలాధ్యక్షుడు చాతవేణి మహేశ్ డిమాండ్ చేశారు. పరిశ్రమలు రద్దు అయ్యే వరకు పోటాం చేస్తామని హెచ్చరించారు.